క్లుప్తంగా

జీకేపై అవగాహన అవసరం



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న ఎర్రమ్మ

శ్రీకాకుళం అర్బన్: ప్రస్తుత తరుణంలో ప్రపంచంలో ఏమి జరుగుతుందో తెలుసుకునేందుకు ప్రతి ఒక్క చిన్నారికీ జనరల్ నాలెడ్జ్‌పై కనీస అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ ఉపాధ్యాయురాలు టి.ఎర్రమ్మ అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు దేశ రాజధానులు, జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పించారు. సచివాలయం ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ ఐశ్వర్య పోక్సో చట్టం, బాల్య వివాహాల వల్ల వచ్చే నష్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి.భాస్కరరాజా, సిబ్బంది వరలక్ష్మి, రామ్మోహన్, గణేష్ పాల్గొన్నారు.

కవి కుమారరాజుకు సాహితీ రత్న పురస్కారం



కుమారరాజుకు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షులు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, ప్రముఖ కవి బుర్రి కుమారరాజుకు తెలుగు సాహితీ రత్న జాతీయ ప్రతిభా పురస్కారం వరించింది. ఏలూరులో ఆదివారం జరిగిన శ్రీశ్రీ కళావేదిక సాహితీ పట్టాభిషేక మహోత్సవాలు, ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల సందర్భంగా అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్‌కుమార్, జాతీయ కన్వీనర్ కొల్లి రమాపతి పర్యవేక్షణలో కుమారరాజుకు సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

పెద్దింటికి జాతీయ యువకీర్తి పురస్కారం



ముకుందరావును సన్మానిస్తున్న కళావేదిక నిర్వాహకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏలూరు పట్టణంలో శ్రీశ్రీ కళావేదిక సాహితీ పట్టాభిషేక మహోత్సవం ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలను ఈ నెల 10, 11వ తేదీల్లో నిర్వహించారు. ఐఎస్ఓ గుర్తింపు పొందిన ఈ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో ఈ సంబరాలు నిర్వహించింది. శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) తెలుగు విభాగాధిపతి, సహాయ ఆచార్యులు, జాతీయ సేవాపథకం సమన్వయ కర్త డాక్టర్ పెద్దింటి ముకుందరావుకు జాతీయ యువకీర్తి పురస్కారం అందజేశారు. శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ, పరిపాలన అధికారి మునిరామకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిన్నబజారు ప్రాంతంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక శ్రీకాకుళం కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం సోమవారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు సంతోష్‌కుమార్, ఈశ్‌లాలు, సుధాకర్, రాంబాబు, అప్పన్న, దుర్గారావు, లక్ష్మి, సంతోషి, లావణ్య, రమ్య పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను బ్లాక్ చేయడం దుర్మార్గం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ బదిలీల కౌన్సిలింగ్‌లో పోస్టులను బ్లాక్ చేసేలా విద్యాశాఖ అధికారులు కుయుక్తులకు పన్నుతుండటం దుర్మార్గమని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మొత్తం మంజూరైన పోస్టుల నుంచి పనిచేస్తున్న పోస్టుల్ని తీసివేయగా మిగిలి ఉన్న ఖాళీలన్నింటినీ బ్లాక్ చేస్తున్నారని, ఇది ఎంత మాత్రం సరికాదని, ఖాళీ పోస్టుల్ని బ్లాక్ చేయడం మానుకోవాలని కోరారు. ఇప్పటికే ప్రభుత్వం చేస్తున్న మార్పులు కారణంగా అధికసంఖ్యలో ఉపాధ్యాయులు రీఅపోర్షన్‌కు గురివుతున్నారని, జిల్లాలో కనీసంగా అన్ని క్యాడర్లు కలిపి 500 మంది వరకు ఉపాధ్యాయులు మిగులుగా ఉండే పరిస్థితులు దాపురించాయన్నారు. అలాంటి పరిస్థితుల్లో ఖాళీలను బ్లాక్ చేయవలసిన అవసరమేమిటో అధికారులు తెలియజేయాలని డిమాండ్ చేశారు.

చెరువులో అక్రమ తవ్వకాలు!

- కూటమి నాయకుల బరితెగింపు
- పట్టించుకోని అధికారులు

శ్రీకాకుళం రూరల్:

కూటమి నాయకులు బరితెగిస్తున్నారు. మండల పరిధిలోని రాగోలు పంచాయతీ రాగోలుపేట గ్రామంలోని నల్ల చెరువును ఆక్రమించుకొని మట్టిని తవ్వేసి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అయితే దీన్ని అరికట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సర్వేనెంబర్ 7/1లో 1260 సెంట్ల స్థలంలో కొంత భాగం చెరువు ఆక్రమణకు గురైనట్టు తెలిసింది. స్థానికంగా ఉన్న కూటమి నాయకులు చెరువు గర్భాన్ని తొలిచేసి మట్టిని ఆక్రమంగా తరలించి విక్రయిస్తూ సొమ్ములు చేసుకుంటున్నారు. పగటిపూట చెరువు అభివృద్ధి పనుల్లా తవ్వకాలు చేస్తూ రాత్రి వేళల్లో మట్టిని ట్రాక్టర్లతో డంప్ చేసుకుంటూ స్థానికంగా వ్యాపారం చేసుకుంటున్నారు. చెరువులో పెద్దపెద్ద గొయ్యిలు తవ్వేయడంతో ఇటువైపుగా మేతకు వెళ్తున్న పశువులు అందులో పడిపోయి మృత్యువాతకు గురవుతున్నాయి. వాస్తవంగా చెరువు గర్భంలో తవ్వకాలు, అభివృద్ధి పనులు వంటివి గ్రామీణ ఉపాధిహామి పథకంలో పెట్టి కొనసాగించాలి. కానీ మండల పరిషత్, రెవెన్యూ అధికారుల అండదండలతో కొందరు కూటమి నాయకులు దర్జాగా మట్టి వ్యాపారాలకు పాల్పడుతుండడం స్థానికంగా చర్చాంశనీయమైంది.



చెరువు గర్భంలో మట్టిని తవ్వేసిన దృశ్యం



రాత్రి సమయంలో మట్టిని తరలించే రోడ్డు

నాకు ప్రాణహాని ఉంది



రాగోలుపేటలో జరుగుతున్న మట్టితవ్వకాలు, చెరువు కబ్జాలపై వాట్సాప్ గ్రూప్‌లో రెవెన్యూ, మండల పరిషత్ అధికారులకు ఫిర్యాదు చేశాను. కూటమి పార్టీలకు చెందిన కూటికుప్పల సురేష్ అనేవ్యక్తి తనను బెదిరిస్తున్నాడు. తమను ఎవరూ ఏమి చేయలేరని.. నువ్వు ఎక్కువ చేస్తే చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. నాకు ప్రాణహాని ఉంది.

– కె.ధనుంజయ, రాగోలుపేట

పరిశీలిస్తాం

రాగోలుపేటలో జరుగుతున్న మట్టి తవ్వకాలు నా దృష్టికి రాలేదు. మా సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలిస్తాం. ఆక్రమంగా మట్టితవ్వకాలు, కబ్జాలు చేయడం చట్టరీత్యా నేరం. అటువంటి వారిపై చర్యలు తీసుకుంటాం.

–గణపతి, శ్రీకాకుళం తహసీల్దార్

ఘనంగా అన్నమయ్య జయంత్యుత్సవం



శ్రీకాంత్ బృందం నృత్యప్రదర్శన



అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న చిన్నారులు, మహిళలు

- ఆకట్టుకున్న నృత్యప్రదర్శనలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో శ్రీవాణీ సంగీత కళా క్షేత్రం అధ్యక్షులు దుంపల ఈశ్వరరావు ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమాచార్యుల 617వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు నగరంలోని వివిధ సంగీత సంస్థల ఆధ్వర్యంలో సుమారు 200 మంది చిన్నారులు, మహిళలు, గాయకులచే సంకీర్తనల గానం సాగింది. సరస్వతీ సంగీత విద్యానిలయం అధ్యక్షులు మావుడూరి శ్రీనివాస్, శ్రీరాజరాజేశ్వరి సంగీత పీఠం అధ్యక్షులు సుసరావు లక్ష్మీ గణపతి శర్మ, ఆరోహి స్కూల్ ఆఫ్ మ్యూజిక్ అధ్యక్షులు పెంకి నాగేశ్వరరావు, షిర్డీసాయి సంగీత విద్యాలయం అధ్యక్షులు జాక త్రివిక్రమదేవ్ ఆధ్వర్యంలో అన్నమయ్య కీర్తనలు చక్కగా ఆలపించారు. ముందుగా రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్యులచే అన్నమాచార్య కీర్తనపై ప్రత్యేక నృత్యం చక్కగా ఆకట్టుకుంది. కాలభైవర పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ, మాజీ ఎంపీపీ కూన ప్రమీల, వ్యాపారవేత్త అందవరపు సంతోష్‌కుమార్, అభినయ నృత్య నికేతన్ గురువు నీరజ సుబ్రహ్మణ్యంలు అన్నమయ్య చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. సాయంత్ర సభా కార్యక్రమం అనంతరం సప్తగిరి సంగీతార్చన జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, రెడ్డి సత్యన్నారాయణ, ఉమాలక్ష్మి, మల్లెమొగ్గల లక్ష్మి, దన్నాన రామారావు, పద్మజ, విశ్వేశ్వరరావు, ప్రియంవద, మావుడూరు సత్యన్నారాయణశర్మ, దూసి రమేష్, దూసి కనకమహాలక్ష్మి, మావుడూరు సూర్యప్రసాదరావు, బంకుపల్లి దుర్గాశ్రీనివాసశర్మ, మండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంధకారంలో ఫరీదుపేట



తెగిపడిన విద్యుత్ వైరు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. మండలంలోని చాలా గ్రామాల్లో విద్యుత్ వైర్లపై చెట్లు కొమ్మలు పడ్డాయి. ఫరీదుపేటలో విద్యుత్ తీగ తెగి పడటంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

మెట్టవలసలో పారిశుద్ధ్య పనులు



బ్లీచింగ్ చల్లుతున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని మెట్టవలసలో గ్రామదేవత పండగ సందర్భంగా సోమవారం గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అన్ని వీధిల్లోనూ బ్లీచింగ్ చల్లారు. సర్పంచ్ కాముజుల అరుద్ర, ఎంపీటీసీ బెవర విజయలక్ష్మి పర్యవేక్షించారు పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, నాయకులు కాముజుల సీతారాం, బెవర జగన్నాథం, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



పూజలు అందుకుంటున్న అమ్మవారు

ఎచ్చెర్ల క్యాంపస్: కుంచాలకూర్మయ్యపేటలో గల దేవీ ఆశ్రమంలో సోమవారం వైశాఖ మాసం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరీ దేవికి పీఠాధిపతి తేజోమూర్తి బాల భాస్కరశర్మ మంగళహారతి ఇచ్చారు. మహా మేరువులకు, శ్రీ చక్రాలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

దేశ వ్యాప్త సమ్మె విజయవంతం చేయండి



నిరసన తెలియజేస్తున్న సీపీఎం, కార్మిక యూనియన్ల ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. ఎచ్చెర్ల మండల కేంద్రంలో సోమవారం ఫాసిజం నుంచి ప్రజలను కాపాడాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎర్రజెండా 80వ వార్షిక విజయోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి, కార్పొరేట్ శక్తులకు మద్దతుగా నిలుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్స్‌ను అమలు చేస్తోందని విమర్శించారు. కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారి వ్యవస్థను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ సంస్థలుగా మార్చే ప్రయత్నం, కుట్ర జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కార్మిక యూనియన్ నాయకులు అంబటి సత్యనారాయణ, టి.రవికుమార్, వెంకటేష్, వరదరాజు, రామప్పడు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం



రామారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ సీనియర్ సభ్యులు, న్యాయవాది కూన రామారావు మృతి బాధాకరమని అసోసియేషన్ నాయకులు అన్నారు. ఈ మేరకు కోర్టు ఆవరణలోని రామారావు చిత్ర పటానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు తంగి శివప్రసాద్‌రావు, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు, ఉపాధ్యక్షులు ఇప్పిలి సీతరాజు పాల్గొన్నారు.

డచ్ భవనానికి మరమ్మతులు చేపట్టాలి



భవనాన్ని పరిశీలిస్తున్న కృష్ణారావు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కలెక్టరేట్ సమీపంలో ఉన్న డచ్ భవనం శిథిలావస్థకు చేరుకుందని, దీనిని వెంటనే మరమ్మతులు చేపట్టాలని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు కోరారు. డచ్ బిల్డింగ్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చరిత్రకు గుర్తులుగా ఉన్న ఇటువంటి భవనాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

రోగుల పట్ల ప్రేమాభిమానాలు చూపాలి



అకడమిక్ డైరెక్టర్ నాగేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: రోగుల పట్ల ప్రేమాభిమానాలు చూపాలని జెమ్స్ కాలేజ్ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సుధీర్ అన్నారు. అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవాన్ని సోమవారం జెమ్స్ ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేస్తూ నర్సులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. రోగి ఏ వ్యాధితో ఆస్పత్రికి వచ్చినా వారి విన్నపాలు ముందుగా వినాలన్నారు. వైద్యుడికి కష్టం చెప్పుకుంటే వారికి వ్యాధి నుంచి కొంత ఉపశమనం లభిస్తోందన్నారు. అనంతరం వైద్యరంగంలో ప్రతిభ కనబర్చిన నర్సులకు అవార్డులను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జెమ్స్ ప్రిన్సిపాల్ లక్ష్మీలలిత, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ పద్మావతి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజేశ్వరి, బొల్లినేని మెడిస్కిల్స్ అకడమిక్ డైరెక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రహదారులు ఏర్పాటు చేయాలి



ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: కొత్తపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కోదువానిపేట, సాకివానిపేట, గాడుపేట గ్రామాల శ్మశాన వాటికలకు రహదారులు ఏర్పాటు చేయాలని శ్రీకాకుళం పట్టణంలోని మీ కోసం పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఆయా గ్రామస్తులు సోమవారం ఫిర్యాదు చేశారు. రోడ్డులు సక్రమంగా లేవని, పిచ్చి మొక్కలు, చెట్లతో నిండి ఉన్నాయన్నారు. అంత్యక్రియలు నిర్వహించేందు ఇబ్బంది పడుతున్నామని తెలిపారు.

విజ్ఞానంతో పాటు వినోదం అవసరం



చిన్నారులకు విజ్ఞానంతో పాటు వినోదం ఎంతో అవసరమని బలగ గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన అన్నారు. బలగ హడ్కో కాలనీలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం పిల్లలకు నీతి కథలు, పొడుపు కథలు చెప్పారు. అనంతరం మెమొరీ గేమ్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత పాల్గొన్నారు.

–శ్రీకాకుళం అర్బన్

అన్నమయ్య జయంతి వేడుకలు



శ్రీకాకుళం నగరంలోని వీధుల్లో తాళ్లపాక అన్నమాచార్యులు 617వ జయంతి వేడుకలు పాతశ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం కమిటీ సభ్యులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వీధులలో అన్నమయ్య చిత్రపటంతోపాటు సంకీర్తనలను గానం చేస్తు తిరువీధి నిర్వహించారు. ఆలయ గౌరవ అధ్యక్షులు ఎల్.నందికేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

–శ్రీకాకుళం కల్చరల్

క్రీస్తు బోధనలు అనుసరణీయం



ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని విశాఖకు చెందిన క్రీస్తు సైనికులు రెవ.సీహెచ్ దానియేలు కుమార్ అన్నారు. గూనపాలెం చెరువుగట్టు వద్దగల మెస్సీయ పెంతుకోస్తు పరిశుద్ధ సంఘం, ఎలోహిం క్రైస్తవ ప్రార్థన సహవాసం ఆధ్వర్యంలో దైవ సేవకుల దంపతుల ఆశీర్వాద పండుగ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే గొండు శంకర్, పాస్టర్ ఎన్.సురేష్‌ఐజాక్, భవిరి రమణ, ఉమా, రెవ.డాక్టర్ జాన్ జీవన్, సామ్యూల్ మోజెస్, రెవ.డానియేలు పాల్గొన్నారు.

–శ్రీకాకుళం కల్చరల్

నేత్రపర్వంగా పుష్పయాగ మహోత్సవం



పుష్ప కవచ ధారణలో స్వామివారు



పుష్పయాగానికి సిద్ధమైన స్వామివారు



యాగం కోసం సిద్ధం చేసిన పుష్పాలు



అవభృద స్నానం చేయిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమలకొండపై వెలసిన వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం తిరువీధి ఉత్సవం వైభవంగా జరిగింది. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు, ఈవో శ్యామలరావుల పర్యవేక్షణలో గరుడ వాహనంపై శ్రీభూనీళా సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను అలంకరింపచేసి ఆశీనులను చేశారు. భక్తులు స్వామివారిని కీర్తిస్తూ రథాన్ని లాగుతూ ఊరేగించారు. స్వామివారి గరుడ వాహనాన్ని విద్యుత్ దీపాలతో, పూల మాలలతో అలంకరించారు. ఉదయం స్వామివారు రజత కవచ ధారణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. తిరువీధిలో కోలాటం బృందం ప్రదర్శన చక్కగా సాగింది. వేంకట రామానుజ సేవాదళం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం కుశాలపురం పంచాయతీ పరిధి సింహద్వారం యూటర్న్ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడింది. లావేరు మండలం బడుమూరుకు చెందిన జి.లావణ్య శ్రీకాకుళం వైపు స్కూటీని నడిపించుకుంటూ వెళ్తున్నారు. శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆమెను వెనుక నుంచి ఢీకొట్టింది. క్షతగాత్రురాలను 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఆస్పత్రి వైద్య పరీక్షల నివేదిక ఆధారంగా రోడ్డు ప్రమాదంపై ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.